క్లుప్తంగా

ప్రపంచ ధరిత్రి దినోత్సవం

కడప ఎడ్యుకేషన్ : కడప ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళ డిగ్రీ కళాశాలలో ప్రపంచ ధరిత్రి దినోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపల్ డాక్టర్ వి.సలీంబాషా మాట్లాడుతూ విశ్వంలో జీవరాశి పెరుగుతున్న గ్రహం భూమి మాత్రమేనని, మనిషి పెరుగుదలకు, పురోభివృద్ధికి తోడ్పాటు నిచ్చే నేలతల్లిని జాగ్రత్తగా కాపాడుకోవాలని చక్కటి కవిత ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పి.సుబ్రహ్మణ్యం, అధ్యాపకులు నాగరత్నమ్మ, అనురాధ పాల్గొన్నారు.

నీమ్ సిటీగా మారుద్దాం

కడప కల్చరల్ : కడప నగరాన్ని నీమ్ సిటీగా మార్చేందుకు కృషిచేద్దామని పర్యావరణ మిత్ర సమూహం ప్రతినిధి ప్రసాద్‌రెడ్డి పిలుపునిచ్చారు. సంస్థ కడప కోర్ గ్రూప్ మెంబర్స్ గాంధీ నగర్ స్కూల్ వద్దగల పార్కులో మంగళ వారం సమావేశమయ్యారు. ధరిత్రి దినోత్సవాన్ని పురస్కరించుకుని ఫ్లకార్డులను ప్రదర్శించారు. రానున్న వర్షాకాలంలో నీమ్ సిటీ కడపకోసం చేపట్టనున్న పనుల గురించి చర్చించారు.

2న ఉచిత ఉపనయనాలు



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న బ్రాహ్మణ సంఘాల ప్రతినిధులు

కడప కల్చరల్ : ఆదిశంకరాచార్యుల జయంతిని పురస్కరించుకుని మే 2న సామూహిక బ్రాహ్మణ ఉచిత ఉపనయనాల కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని సంస్థ ప్రతినిధి విజయ్‌భట్టర్ తెలిపారు. దేవుని కడపలోని సోమేశ్వర స్వామి మంగళవారం సంబంధిత కార్యక్రమ పోస్టర్లను ఆయన విడుదల చేశారు. శుక్రవారం ఉదయం 9.15 నుంచి 10.15 గంటల్లోపు ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వివరించారు. ఆసక్తిగల వారు తమ పేర్లను ఈ నెల 30వ తేదీలోగా నమోదు చేసుకోవాలని సూచించారు.

ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య

కడప ఎడ్యుకేషన్ : రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలల్లో అర్హత కలిగిన ఉపాధ్యాయులు నాణ్యమైన విద్య అందిస్తున్నారని కడప నగరపాలక మూడో వార్డు ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజేశ్వరి పేర్కొన్నారు. నగరంలోని మృత్యుంజయకుంట, మారుతీ నగర్, సీయోనుపురం ప్రాంతాలలో ప్రభుత్వ పాఠశాలలో పిల్లలను చేర్చాలని కోరుతూ మంగళవారం ఉపాధ్యాయులు విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. రాజేశ్వరి మాట్లాడుతూ ఐదేళ్లు నిండిన విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడి పాఠశాలల్లో చేర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సత్యనారాయణ, నాగరాజు పాల్గొన్నారు.

29న భూమి పూజ

కడప కల్చరల్ : సీపీ బ్రౌన్ గ్రంథాలయం అదనపు భవన నిర్మాణాలకు ఈనెల 29వ తేదిన శంకుస్థాపన, భూమి పూజ నిర్వహించనున్నట్లు సీపీ బ్రౌన్ గ్రంథాలయ సలహా మండలి సభ్యులు జానమద్ది విజయభాస్కర్ తెలిపారు. జూన్, జులై నెలల్లో ఒకేమారు నాలుగు స్నాతకోత్సవాలను నిర్వహించేందుకు నిర్ణయం తీసుకోవడం అభినందనీయమని ఆయన అన్నారు. అర్హతగల జిల్లా, సీమ వాసులకు ఈ సందర్భంగానైనా డాక్టరేట్లు ప్రదానం చేయాలని విజయభాస్కర్ కోరారు.

చదువుతో బంగారు భవిషత్తు

కడప ఎడ్యుకేషన్ : పిల్లల చదువుతోనే బంగారు భవిష్య వస్తుందని మను పాలిటెక్నిక్ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ మహమ్మద్ సిఖిందర్ హేస్సేన్ అన్నారు. కడప నగర శివారులోని ఇందిరానగర్ మున్సిపల్ పాఠశాలలో మంగళవారం ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లల బంగారు భవిష్యత్తు చదువుతోనే అన్నారు. ఈ కార్యక్రమంలో ముస్లిం బహుజన ఫ్రంట్ అధ్యక్షుడు జుల్ఫికార్ జీలాన్, మహబూబ్‌ఖాన్, ఖాజీ బషీర్‌అహ్మద్, సబ్జాన్, బాషా, బుఖారి, ఆల్కం పాల్గొన్నారు.

రిమ్స్‌లో అన్న ప్రసాద వితరణ

కడప ఎడ్యుకేషన్ : శ్రవణ నక్షత్రం సందర్భంగా మంగళవారం శ్రీనివాస గోవింద మాల సేవా సమితి ఆధ్వర్యంలో అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. సమితి నిర్వాహకులు రామసుబ్బయ్య, ఫణీంద్ర, భవాని ఉదయ్‌కుమార్, గంగాధర్, జయకృష్ణ, రసూల్ సిద్దు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగినికి లైంగిక వేధింపులు

కడప కోటిరెడ్డిసర్కిల్: ఏపీఎస్సార్టీసి కడప జిల్లాలోని ఓ డిపోలో పనిచేస్తున్న మహిళా ఉద్యోగినిపై అదే డిపోలో పనిచేస్తున్న ఓ ఉద్యోగి లైంగిక వేధింపులకు పాల్పడుతున్నట్లు తమ రీజనల్ మేనేజర్‌కు మంగళవారం ఫిర్యాదు చేశారు. వేధింపులు వాస్తవమనీ నిర్ధారణకు వస్తే ఖచ్చితంగా కఠినచర్యలు తీసుకుంటామని ఆర్ఎం తెలియజేశారు.

స్థూపాన్ని పరిరక్షించాలి

కడప రూరల్ : కడప పాత మున్సిపల్ కార్యాలయంలోని అశోక చక్రవర్తి స్థూపాన్ని పరిరక్షించాలని జేకే వెల్ఫేర్ యూత్ సొసైటీ అధ్యక్షుడు ఖాదర్ బాషా తెలిపారు. మంగళవారం స్థూపాన్ని ఆయన పరిశీలించి మాట్లాడుతూ పాత మున్సిపల్ కార్యాలయం వద్ద స్థూపం చుట్టూ ప్రహరీ నిర్మించి రక్షణ చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. కార్యక్రమంలో రాయల్ కరీముల్లా, తదితరులు పాల్గొన్నారు.

నోరూరించే పండు.. వేసవిలోనే బాగుండు





వేసవి రాగానే.. నోరూరించేది మామిడి పండు.. రాయలసీమలో అధికంగా పండే పంట కూడా మామిడే. వేసవి కాలం రాగానే మామిడి పండ్ల వాసన, రుచి మనల్ని ఆహ్లాదపరుస్తాయి. ఈ ఏడాది మామిడి ఆలస్యంగా వచ్చిందనే చెప్పవచ్చు. ఈ పంట పండించిన రైతు కష్టాలు అన్నీ ఇన్నీ కావు. పూత దశలో అకాల వర్షాలతో కాపు వచ్చే దశలో కాయలు పడిపోయి మామిడి రైతులకు నష్టాలు మిగిలాయి. దీంతో ఈ ఏడాది మామిడి మార్కెట్‌కు కాస్త ఆలస్యంగా వచ్చింది. ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో చేసేది లేక కోత కోసిన మామిడిని మార్కెట్‌కు తరలించేందుకు రైతుకు ఖర్చు తడిసిమోపెడవుతోంది. అయితే ఎట్టకేలకు కడప నగరంలో తోపుడు బండ్లపై పచ్చని రంగుతో మామిడి నోరూరిస్తోంది. అందంగా కనిపించే కొన్ని మామిడి పండ్లు కొనేటపుడు జాగ్రత్తపడాల్సిందే మరి. కాల్షియం కార్బైడ్ రసాయనాన్ని ఉపయోగించి వేగంగా పండించడం వల్ల ఆరోగ్యానికి సమస్యలు తలెత్తవచ్చు. ముందుగా వాటిని గుర్తించి కొనుగోలు చేయాల్సిందే.

– సాక్షి ఫొటోగ్రాఫర్, కడప

• కల్యాణ వైభోగమే!



మాంగల్య దర్శనం చేయిస్తున్న అర్చకులు

కడప కల్చరల్ : దేవుని కడప లక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం శ్రవణా నక్షత్రం సందర్భంగా స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ ఈశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో అర్చక బృందం స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులకు విశేష అభిషేకాలు, అలంకారం చేసి ప్రత్యేక పీఠంపై కొలువుదీర్చారు. అనంతరం కల్యాణ క్రతువును నిర్వహించారు. అర్చకులు స్వామి పక్షాన అమ్మవారి గళసీమలో మహా మంగళ సూత్రాలను అలంకరించారు. ఉభయ దారులతో పూజలు నిర్వహింపజేసి వారితోపాటు భక్తులందరికీ తీర్థ ప్రసాదాలను అందజేశారు. స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవాన్ని తిలకించేందుకు నగర వాసులు విశేష సంఖ్యలో హాజరయ్యారు.

• దుర్గమ్మ సన్నిధిలో దోష నివారణ పూజలు



రాహుకాల పూజలు నిర్వహిస్తున్న భక్తులు

కడప కల్చరల్ : కడప విజయదుర్గాదేవి ఆలయంలో మంగళవారం భక్తులు దోష నివారణకు రాహుకాల పూజలు నిర్వహించారు. తొలుత అమ్మవారి మూలమూర్తిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో సామూహికంగా రాహుకాల పూజలు చేశారు. భక్తులు ఈ సందర్భంగా అమ్మవారికి నిమ్మకాయ దీపాలను వెలిగించి మొక్కుకున్నారు. నిర్వాహకులు సుధా మల్లికార్జునరావు, దుర్గాప్రసాద్ భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

లోకానికి శాంతిని ప్రబోధించిన పోప్ ఫ్రాన్సిస్



పోప్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కథోలిక బిషప్ సగినాల పాల్ ప్రకాశ్ తదితరులు

కడప కల్చరల్ : కథోలిక పీఠానికి మార్గ దర్శనం చేస్తూ లోకానికి శాంతిని ప్రబోధించిన పోప్ ఫ్రాన్సిస్ మరణం ప్రపంచానికి తీరని లోటు అని కడప కథోలిక పీఠం బిషప్ సగినాల పాల్ ప్రకాశ్ అన్నారు. రోమ్‌లోని వాటికన్ సిటీలో మరణించిన పోప్ ఫ్రాన్సిస్‌కు మంగళవారం కడప మేత్రాసనంలోని బిషప్ హౌస్‌లో వీజీ తలారి బాలరాజు, కడప డీన్ ఎండీ ప్రసాద్‌రావు తదితర గురువులతో కలిసి బిషప్ శ్రద్ధాంజలి ఘటించారు. ప్రపంచ శాంతి కోసం పోప్ ఎంతో కృషి చేశారని, ప్రపంచ వ్యాప్తంగా కథోలిక మతాన్ని గొప్పగా వ్యాప్తి చేసిన శాంతి దూత అని కడప మేత్రాసన బిషప్ డాక్టర్ సగినాల పాల్ ప్రకాశ్ అన్నారు. ఆయన మరణం క్రైస్తవ ప్రపంచానికి తీరని లోటని, ఆయన ఆత్మశాంతికి ప్రార్థనలు చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా పోప్ చిత్రపటానికి పూలమాల అలంకరించి ఘనంగా నివాళులర్పించారు. బిషప్ సెక్రటరీ ఊర్దురాజు, నగిరి విచారణ గురువు గుడిమె దేవసహాయం, కథోలిక పెద్దలు యాగప్ప, బాలరాజు, జయపాల్, విక్టర్ తదితరులు పాల్గొన్నారు.

■ స్థానిక శాంతి సేవా సొసైటీ ప్రతినిధి మడగలం ప్రసాద్‌తోపాటు పలువురు విశ్వాసులు ఇందిరానగర్‌లోని సంస్థ కార్యాలయంలో పోప్ చిత్రపటానికి పూలు అర్పించి ఘనంగా నివాళులర్పించారు.

27న ఉచిత వడుగులు

కడప కల్చరల్ : పేద ముస్లింలకు ఈ నెల 27న ఉచిత వడుగుల (ఖత్నా) కార్యక్రమం నిర్వహించనున్నామని సెక్రటరీ మౌల్వి ఖాజీ షేక్ మొహమ్మద్ అలీ రషది తెలిపారు. కడప రవీంద్ర నగర్‌లోని సొసైటీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ నగరంలోని బీడీ కాలనీలో ఉన్న మక్కా మస్జిద్‌లో ఉచిత వడుగుల కార్యక్రమంలుంటుందన్నారు. సరకులతోపాటు ఉచితంగా మందులు పంపిణీ చేస్తామన్నారు. ఇందుకు సంబంధించి పూర్తి వివరాలకు 9848414871, 9703153169 నెంబర్లలో సంప్రదించాలని తెలిపారు. ఈ సమావేశంలో మౌలాన నూరుల్లా, హఫీజ్ అస్గర్ అలీ, అన్వర్ సాబ్ తదితరులు పాల్గొన్నారు.

పోప్ ఫ్రాన్సిస్ మరణం బాధాకరం

కడప వైఎస్సార్‌సర్కిల్ : ప్రపంచ శాంతి, మత సామరస్యం కోసం పోరాడిన పోప్ ఫ్రాన్సిస్ మృతి బాధాకరమని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు ఎన్‌డి.విజయజ్యోతి ఓ ప్రకటనలో తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. కులమతాలకతీతంగా ప్రేమ, సహనంతో ప్రపంచాన్ని ఒకటిగా చేసేందుకు ఆయన చేసిన కృషి అసాధారణమని తెలిపారు. ఆయన మరణం ద్వారా ప్రపంచం ఒక మహా నేతను కోల్పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. క్రైస్తవ సోదర, సోదరీమణులకు, పోప్ అభిమానులకు ఆమె ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ఆర్టీసీ డ్రైవర్లకు శిక్షణ తరగతులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఆర్టీసీ బస్సులు నడిపే డ్రైవర్లు విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉంటూ ప్రమాద రహిత సంస్థగా తీర్చిదిద్దేందుకు తమ వంతు తోడ్పాటు ఇవ్వాలని కడప ట్రాఫిక్ సీఐ జావీద్ అన్నారు. కడప ఆర్టీసీ ఆర్ఎం కార్యాలయంలో డ్రైవర్లకు మంగళవారం శిక్షణ తరగతులు నిర్వహించారు. తొలుత ఓం శాంతి సంస్థ ప్రతినిధి యోగా, ధ్యాన ప్రక్రియలు వివరించారు.

అనంతరం సీఐ మాట్లాడుతూ బస్సు నడిపేటపుడు డ్రైవర్ల కుటుబసభ్యులతోపాటు ప్రయాణికుల భద్రతను గుర్తు పెట్టుకోవాలని, విధులు ముగిసే వరకూ జాగ్రత్తగా ఉండాలని సూచించారు. సెల్‌ఫోన్, ర్యాష్ డ్రైవింగ్‌కు దూరంగా ఉండాలన్నారు. అనంతరం రీజనల్ సేఫ్టీ అధికారి కృష్ణారెడ్డి, డిపో మేనేజర్ డిల్లీశ్వరరావు డ్రైవర్లకు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో 21 మంది డ్రైవర్లు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి విధుల బహిష్కరణ



కార్పొరేషన్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న మున్సిపల్ కార్మికులు

కడప కార్పొరేషన్ : తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మున్సిపల్ కార్మికులు విధులను బహిష్కరించారు. కడప కార్పొరేషన్ కార్యాలయం ఎదుట మంగళవారం వారు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల పదవీ విరమణ వయస్సు 62 ఏళ్లకు పెంచాలని, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ కింద రూ.10 లక్షలు, పింఛన్ రూ.10 వేలు ఇవ్వాలన్నారు. రిటైరైన వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలన్నారు. అదనపు కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐతో కూడిన వేతనాలు ఇవ్వాలన్నారు. ఇంజినీరింగ్ సెక్షన్ కార్మికులకు జీవో నంబర్ 36 ప్రకారం వేతనాలివ్వాలని, 9 మంది పెండింగ్ డ్రైవర్లకు రూ.24500 జీతం ఇవ్వాలన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మనోజ్‌రెడ్డి కార్మికుల వద్దకు వచ్చి ఈ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఏప్రిల్ వేతనం పూర్తి స్థాయిలో ఇస్తామని, 60 సంవత్సరాలు నిండిన వారిని తొలగిస్తే వారికి అడిషనల్ వర్కర్‌గా ఉద్యోగం ఇచ్చి మా వంతుగా ఆదుకుంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ నాయకులు పాల్గొన్నారు.

కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల ధర్నా



కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న ఉద్యోగులు

కడప సెవెన్‌రోడ్స్ : తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఏపీ మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్/కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల అసోసియేషన్ మంగళవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించింది. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన హెల్త్ ఆఫీసర్లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి సందీప్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు 350 మంది ఉన్నారని, ఆరేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న వారిని రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. ఆయుష్మాన్ భారత్ నిబంధనల ప్రకారం ఉద్యోగ భద్రత కల్పించాలని, నేషనల్ హెల్త్ మిషన్ ఉద్యోగులతో సమానంగా 23 శాతం వేతన సవరణ చేయాలని డిమాండ్ చేశారు. 2024లో ఈపీఎఫ్ సౌకర్యాన్ని ఎందుకు రద్దు చేశారో చెప్పాలని కోరినా ఉన్నతాధికారులు సమాధానం ఇవ్వకపోవడం విచారకరమన్నారు. క్లినిక్ అద్దె బకాయిలను వెంటనే చెల్లించాలని కోరారు. ఎక్స్‌గ్రేషియా, సెలవులు, ఇంక్రిమెంట్లు, బదిలీలు వంటివి అమలు చేయాలని కోరారు. ఇప్పటికైనా తమ సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

కార్మిక వ్యతిరేక విధానాలను విడనాడాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలను సత్వరమే విడనాడాలని రైల్వే గూడ్స్ షెడ్ హమాలీ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) అధ్యక్ష, కార్యదర్శులు కేసీ.బాదుల్లా, ఎస్.మహబూబ్‌బాషా తెలిపారు. రైల్వే స్టేషన్ ఆవరణలోని యూనియన్ కార్యాలయంలో మేడేకు సంబంధించిన గోడపత్రాలను మంగళవారం వారు విడుదల చేశారు. ఈ సందర్భంగా బాదుల్లా మాట్లాడుతూ అంతర్జాతీయ కార్మిక దినోత్సవం మేడే రోజున ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న హక్కులు, సంక్షేమ పథకాలు ఒక్కొక్కటిగా కనుమరుగవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుత పాలకుల విధానాలు పాత హక్కులన్నీ హరించి వేస్తుండడం తమను కలవరపరుస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం 44 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడులుగా మార్చడం, లాభాల్లో నడుస్తున్న రైల్వేలు బొగ్గు పరిశ్రమ, విశాఖ ఉక్కు లాంటి 37 ప్రభుత్వ రంగ పరిశ్రమలను ప్రవేటీకరించడం లాంటి చర్యలు కార్మికవర్గాన్ని పోరుదారుల్లోకి మళ్లిస్తున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైల్వే గూడ్స్ షెడ్ హమాలీవర్కర్స్ యూనియన్ నాయకులు పాల్ చిన్న ఓబులేసు, శ్రీను, నాగేంద్ర, సూరి, సుబ్బారావు పాల్గొన్నారు.

ఉర్దూ డీఐ పోస్టు భర్తీచేయాలి

• ఆర్జేడీ శామ్యూల్‌కు రూట వినతి

కడప ఎడ్యుకేషన్ : రాయలసీమ జోన్ పరిధిలో ఖాళీగా ఉన్న కడప, అనంతపురం, చిత్తూరు, కర్నూలు జిల్లాల ఉర్దూ డీఐ (డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్) పోస్టులు అర్హులైన స్కూల్ అసిస్టెంట్లతో భర్తీ చేయాలని రాష్ట్ర ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర కో ఆర్డినేటర్ షేక్ ముహమ్మద్ అయుబ్, వైయస్సార్ కడప జిల్లా అధ్యక్షులు జాకీర్ హుస్సేన్ కోరారు. పాఠశాల విద్య ఆర్‌జేడీ శ్యాముల్‌ను ఈ విషయమై మంగళవారం కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉర్దూ పాఠశాలల పర్యవేక్షణ, సమగ్రాభివృద్ధికి ఉర్దూ డీఐ ఎంతో దోహదపడతారని అన్నారు. హెచ్‌ఎంలకు పదోన్నతులు కల్పిస్తున్న తరుణంలో సమాన హోదా కలిగిన ఉర్దూ డీఐ పోస్టులు భర్తీ చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు సయ్యద్ సిరాజుద్దీన్, నగర అధ్యక్షుడు ఖాదర్ బాషా, కోశాధికారి నూరుల్లా పాల్గొన్నారు.

గొప్ప మానవతావాది లెనిన్



లెనిన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

కడప వైఎస్ఆర్ సర్కిల్ : శ్రామిక ప్రజల విముక్తి కోసం తన జీవితాన్ని అంకితం చేసిన గొప్ప మానవతావాది లెనిన్ అని సీపీఎం కడప నగర కార్యదర్శి రామమోహన్ అన్నారు. లెనిన్ జయంతి సందర్భంగా నగరంలోని మృత్యుంజయకుంట సీపీఎం కార్యాలయంలో ఆయన చిత్ర పటానికి మంగళవారం పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లెనిన్ బాల్యం అత్యధిక భాగం జైల్లో, రహస్య జీవనంలోనూ సాగిందని, మార్క్సిస్టు సిద్ధాంతాన్ని నిర్దిష్టంగా అమలు చేయడం ఎలాగో కార్మికులకు ఆయన బోధించాడని పేర్కొన్నారు. దేశంలో మతోన్మాద శక్తులు ప్రజల మధ్య చీలిక తీసుకువస్తూ అనైక్యతను పెంచి పోషిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు బి.దస్తగిరిరెడ్డి, కుమారస్వామిరెడ్డి, నారాయణరెడ్డి, రామకృష్ణారెడ్డి, నరసింహ, మహేష్ పాల్గొన్నారు.

కేంద్ర కారాగారం పరిశీలన



ఖైదీలతో మాట్లాడుతున్న న్యాయమూర్తులు

కడప అర్బన్ : ఆంధ్ర ప్రదేశ్ జిల్లా న్యాయ సేవాధికారసంస్థ చైర్మన్ డాక్టర్ సి.యామిని, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరి ఎస్.బాబా ఫకృద్దీన్‌లు తమ సిబ్బందితో కలిసి మంగళవారం కడప పురుషుల కేంద్ర కారాగారం, ప్రత్యేక మహిళా కారాగారం సందర్శించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ హైకోర్టు దోషిగా నిర్ధారించినప్పటికీ, ఖైదీ ఇంకా భారత సుప్రీంకోర్టులో అప్పీల్ దాఖలు చేయని విషయం గుర్తు చేశారు. శిక్ష నుంచి ఉపశమనం పొందేందుకు అర్హత ఉన్న ఖైదీలను గుర్తించడం జరుగుతోందన్నారు. ఉచిత న్యాయ సహాయం, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టం, లీగల్ సర్వీసెస్ హెల్ప్ లైన్ నెంబర్ 15100 వివరించారు. అనంతరము పురుషుల కేంద్ర కారాగారం, ప్రత్యేక మహిళా కారాగారం ప్రిసన్ లీగల్ ఎయిడ్ క్లినిక్‌లను సంబంధిత రిజిస్టర్లను పరిశీలించారు. లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టంను వివరించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది చంద్రకాంతమ్మ, ప్రవీణ్ కుమార్, సౌజన్య, అక్బర్ అలీ, రవితేజ, సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్ హయాంలోనే అభివృద్ధి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్‌రెడ్డి హయాంలో జిల్లా అభివృద్ధి మెరుగ్గా జరిగిందని కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి సయ్యద్ గౌస్‌పీర్ అన్నారు. తన కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ పేద ప్రజలకు వైద్య సేవలందిస్తున్న రిమ్స్ ఆసుపత్రి, వైవీయూ యూనివర్శిటీ, బుగ్గవంకపై వంతెన నిర్మాణం కాంగ్రెస్ హయాంలోనే చేపట్టారన్నారు. రాబోయే కార్పొరేషన్ ఎన్నికల్లో 50 డివిజన్లలో కాంగ్రెస్ పార్టీ గెలుపునకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో సిరాజుద్దీన్, రఫీక్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా పశు సంవర్ధశాఖ అధికారుల సేవా సంఘం ఏర్పాటు

కడప ఎడ్యుకేషన్ : ఉమ్మడి కడప జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారుల సేవా సంఘం అధ్యక్షుడిగా డాక్టర్ రాజోలి శ్రీధర్‌రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కడప వెటర్నరీ పాలీ క్లినిక్‌లో మంగళవారం సంఘం సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ ప్రతాప్, కోశాధికారిగా డాక్టర్ రవీంద్రనాథరెడ్డి, ఉపాధ్యక్షుడిగా డాక్టర్ నాగభూషణం, సంయుక్త కార్యదర్శిగా డాక్టర్ చంద్రశేఖర్ ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా పశుసంవర్ధక శాఖ అధికారుల సేవా సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ పార్థసారధిరెడ్డి వ్యవహరించారు.

పురందేశ్వరి జన్మదిన వేడుకలు

కడప కోటిరెడ్డిసర్కిల్ : భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి జన్మదిన వేడుక కడపలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. నగరంలోని పార్టీ కార్యాలయంలో నేతలు కేక్ కోసి సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు జంగిటి వెంకటసుబ్బారెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి బాలకృష్ణ యాదవ్, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు బొమ్మన విజయ్, నాగిరెడ్డి, బీజేపీ, బీజేవైఎం నాయకులు పాల్గొన్నారు.

ఆశాలకు వేతనం పెంచాలని వినతి



ఆర్డీఓ జాన్ ఇర్విన్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కడప వైఎస్ఆర్ సర్కిల్ : ఆశాలకు ఇచ్చిన హామీ మేరకు తక్షణమే వేతనం పెంచి బ్యాలెన్స్ మొత్తం రాష్ట్ర ప్రభుత్వమే చెల్లించాలని ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షుడు గుంటి వేణుగోపాల్, ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కోశాధికారి సి.అమ్ములు, ఏఐటీయూసీ నగర అధ్యక్షుడు సుబ్బరాయుడు డిమాండ్ చేశారు. కడప రెవెన్యూ డివిజనల్ అధికారి జాన్ ఇర్విన్‌ను మంగళవారం వారు కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి నడ్డా రాజ్యసభలో ఆశాలను ఉద్యోగులుగా గుర్తిస్తామని, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ ఇస్తామని, వేతనాలు పెంచుతామని ప్రకటించారని, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అసెంబ్లీలో ఆశాలకు,వేతనంతో కూడిన మెటర్నిటీ సెలవులు, రిటైర్మెంట్ వయసు పెంపు చేస్తామని ప్రకటించారని తెలిపారు. తక్షణమే జీవోలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పని గంటలు తగ్గించి ఉదయం పూట మాత్రమే విధులు నిర్వహించే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమస్యలను పరిష్కరించకపోతే రాష్ట్ర వ్యాప్త ఆందోళన చేపడతామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పార్వతి, రేణుక, రాజేశ్వరి, హుస్సేని, ప్రియదర్శిని, నిర్మల పాల్గొన్నారు.

ఎడిఫై యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రవి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : ఎలాంటి గుర్తింపు లేకుండా విద్యార్థుల తల్లిదండ్రులను మోసం చేస్తూ అక్రమంగా అడ్మిషన్లు నిర్వహిస్తున్న ఎడిఫై పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరపోగు రవి డిమాండ్ చేశారు. నగరంలోని ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో విలేకరులతో ఆయన మట్లాడుతూ చింతకొమ్మదిన్నెలోని ఎడిఫై పాఠశాల యాజమాన్యం అనుమతులు లేకుండా కోట్ల రూపాయల ఫీజులు వసూలు చేస్తోందన్నారు. ఆ పాఠశాల యాజమాన్యం అనుమతి కోసం దరఖాస్తు చేసినా మండల విద్యాధికారులు తిరస్కరించారన్నారు. ఇప్పటికైనా పాఠశాలపై చర్యలు తీసుకోని పక్షంలో ఆందోళన చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నగర కార్యదర్శి మోహన్, నగర నాయకులు ఉదయ్‌లు పాల్గొన్నారు.

బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకుందాం



మాట్లాడుతున్న కడప రిమ్స్ సీఐ సీతారామిరెడ్డి

కడప అర్బన్ : దేశ భవిష్యత్తును కృంగదీసే మాదక ద్రవ్యాలను పూర్తిగా నిర్మూలిద్దాం అంటూ కడప రిమ్స్ పిఎస్ సీఐ సీతారామిరెడ్డి పిలుపునిచ్చారు. కడప రిమ్స్ వైద్య కళాశాలలో 'పోలీస్ కళాజాత' ఆధ్వర్యంలో మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలపై యువతా.. మేలుకో..! నాటక ప్రదర్శన నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ యువత మత్తుకు అలవాటు పడి భవిష్యత్తును విచ్ఛిన్నం చేసుకోవద్దని, ప్రతి ఒక్కరూ తమ భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలని సూచించారు. మత్తు పదార్థాలతో విచక్షణా శక్తిని కోల్పోతున్నారన్నారు. మత్తు పదార్థాలు విక్రయిస్తున్నారన్న సమాచారం తెలిస్తే పోలీసులకు తెలియజేయాలని, వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా.సురేఖ, వైస్ ప్రిన్సిపాల్ డా.విజయభాస్కర్‌రెడ్డి, డా.నరసమ్మ, అధ్యాపకులు, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.